


# అధిక ప్రసంగం

**పైడిపాల**

"ఆడపిల్లకు సంబంధం చూడ్డం ఇంతకంటె తేలికనిపిస్తోంది" అన్నాడు స్కూటర్ స్టార్ట్ చేస్తూ సూర్యారావు.

"కట్నమివ్వగలిగితే ఈ రోజులలో అదేం పెద్ద సమస్యకాదండి" వంతపాడేడు మెసెంజర్ రాము.

"ఇవాళ బాగో వోగో — ఏదో ఇల్లు సెటిల్ చేసి తీరాల్సిందే" — వారం రోజులుగా ఇళ్ళ వేటలో విసిగిపోయాడు సూర్యారావు.

"మీరు కంగారుపడకండి సార్. తీరా అమ్మగారొచ్చాక నచ్చకపోతే అప్పుడు మరీ కష్టం."

"బాగుంది. మనకు కావాల్సినట్టు వుండడానికి ఇదేం సొంతిల్లా?"

"ఓపికపడితే అలాంటిదే దొరుకుతుంది సార్. అన్నట్టు ఈ సందులోకి పోనివ్వండి. ఇక్కడ కొత్తగా కట్టిన ఇల్లొకటి వుందని తెల్సింది."

స్కూటర్ సందులోకి మళ్ళి, రంగులేసిన ఓ కొత్త డాబా ముందు ఆగింది.

"రమ్మంటున్నారు సార్" లోపల కెళ్ళొచ్చిన రాము మొహం చూడగానే రావు కర్థమయింది ఇల్లు ఖాళీగా వుందని.

"రండి కూర్చోండి" కుర్చీ చూపించాడు మార్కెండేయులు. శ్రోత్రియుడిలా వున్న ఆయన రూపంచూడగానే రావుకి ఆశ అడుగంటిపోయింది.

"మార్కెండేయులుగారు ఈయనే సూర్యారావుగారు. మా బాంకుకి కాషియర్‌గా వచ్చారు" యజమానిని పరిచయం చేశాడు రాము.

"లోపలకు రండి. పోర్షన్ చూసుకుందురుగాని" లోపలకు దారితీశాడు మార్కండేయులు.

అది ఆరు గదులు. ఇంట్లో మూడు వరస గదుల పోర్షన్. గదులు ఆధునిక సౌకర్యాలతో విశాలంగా వున్నాయి.

"ఇది అద్దెకోసం కట్టిన ఇల్లు కాదు. మా అబ్బాయి వుంటాడని కట్టాం. తీరా, వాడికి హైదరాబాద్ ట్రాన్స్‌ఫర్ అయింది. ఇంట్లో నేను, మా ఆవిడ, కాలేజీలో చదువుతున్న మనవరాలు మిగిలాం. మంచి వాళ్ళెవరికైనా ఓ పోర్షన్ ఇచ్చేస్తే తోడుగా వుంటారని..." మార్కండేయులు ఇల్లంతా తిప్పుతూ దాని చరిత్ర వివరిస్తున్నాడు.

"ఇల్లు నచ్చింది. కాని అసలు విషయం మా రాము చెప్పాడా?" గిల్టీగా నసిగాడు సూర్యారావు.

"ఏమిటి?"

"మేము నాన్ బ్రాహ్మిన్స్"

"అయితే ఏమిటి? మా కలాంటి పట్టింపులు లేవు. మీరిలా చెప్పడం..."

"మీరింత వరకు అడగలేదని. ఈ వూళ్ళో మీరు తప్ప ఇంతవరకు ఎవరూ కులం అడక్కుండా ఇల్లు చూపించలేదు. థాంక్స్. అద్దె విషయం చెపితే..."

"మూడొందలు. కరెంటు మీరే కట్టుకోవాలి. సబ్ మీటరుంది."

"అలాగే. అడ్వాన్సు ఎంతిమ్మంటారు?" ఆలసిస్తే ఎక్కడ అవకాశం జారిపోతుందోనని కంగారు పడుతున్నాడు రావు.

"ఓ నెల అద్దె. తొందరేం లేదు. మీరు వచ్చిన తర్వాత ఇవ్వొచ్చు."

"అలా క్కాదు వుంచండి" మిగతా ఇంటి యజమానులు పెట్టిన సవాలక్ష షరతులు గుర్తొచ్చిన

రావుకి మార్కండేయులు దేవుడిలా కనిపించాడు. వెంటనే మూడు కొత్తనోట్లు తీసి చేతిలో పెట్టాడు.

"మా ఫామిలీ మెంబర్స్ నలుగురం. మేమిద్దరం, మా అమ్మగారు, నాలుగేళ్ళ బాబు" ఇంట్లో వుండేదెందరని మిగతావాళ్ళు అడిగిన ప్రశ్నలు గుర్తొచ్చి వినయంగా నివేదించాడు రావు.

"ఇదేం లాడ్జి కాదు గదా? మీరెంత మంది వున్నా మాకభ్యంతరం లేదు"

"అది కాదు లెండి. నీళ్ళ వాడకం దృష్టిలో పెట్టుకుని కొంతమంది ఓవర్స్ అడిగారు. యు ఆర్ లిబరల్. మరో వారం రోజులలో ఫామిలీని తీసుకుని వస్తానండి"

"అలాగే. మీరెప్పుడొస్తే అద్దె అప్పటి నుంచే లెక్క."

"థాంక్యూ. మరి వెళ్ళొస్తామండి"

"ఆగండి. టీ తీసుకుని వెళ్దురు గాని"

రావు వద్దన్నా మార్కండేయులుగారి బలవంతం మీద కూర్చోక తప్పలేదు.

మనవరాలు ముగ్గురుకీ టీ తీసుకొచ్చి ఇచ్చింది. ఆ అమ్మాయిది కళ్ళు చెదిరే అందం.

టీ తాగుతుండగా — టీపాయ్ మీద పడివున్న వీక్లీలను చూసి రాము అన్నాడు — మౌనాన్ని చీలుస్తూ.

"మా రావుగారు మంచి రచయిత కూడా నండి. పత్రికలలో చాలా రాస్తుంటారు"

"అలాగా? ఏ పేరుతో?"

"అంశుమాలి కలం పేరుతో. కథలూ, నవలలూ..."

"చదివాను రావుగారు. ఏమనుకోకండి. మీకు ఇల్లు అద్దెకివ్వడం కుదరదు. ఇదిగో మీ అడ్వాన్సు." నివ్వెరపోయాడు రావు. తర్వాత ప్రాధేయపడ్డాడు. "అదేమిటి సార్? అంత పేరున్నాయన మీ ఇంట్లో వుండడం మీకు గొప్ప కదూ?" రాము ప్రతిమాలాడు.

"బాబూ, రామూ నువ్వేకేం చెప్పకు. ఇన్‌కమ్ టాక్స్ వాళ్ళకి, పోలీసు వాళ్ళకి. ఇంకెవరికయినా అద్దెకిస్తాను కాని నా ఇల్లు రచయితలకు, కార్టూనిస్టులకు మాత్రం ఇవ్వను. ఇంతకుముందు మా అన్న గారింట్లో ఓ రచయిత అద్దెకుండి — ఆడాళ్ళతో చిన్న పేచి వచ్చి ఇంటి వాళ్ళ పాత్రలతో అరడజను కథలు... రెండు నవలలు రాపేశాడు. నేనలాంటి తెలివితక్కువ పనిచేసి వీథినపడలేను" రావు మొర మార్కెండేయులు వినిపించుకోలేదు!

●

తెలుగు కళాసమితి, న్యూజెర్సీ ఆధ్వర్యాన

# 1988 విభవ ఉగాది మినీ కథల పోటీ

**12 కథలకు 12 x 300 — రూ. 3600/-**

**6 x 150 కథలకు రూ. 900/- కన్సొలేషన్ బహుమతులు**

అమెరికాలో నివసిస్తున్న తెలుగువారు తమ మాతృభాష మీద ప్రేమతో, తెలుగు రచయితలపై అభిమానంతో వారిని ప్రోత్సహించడానికి మినీ కథల పోటీని 'ఆంధ్రజ్యోతి' సచిత్ర వారపత్రిక ద్వారా నిర్వహించాలని నిశ్చయించారు. ఈ కథలన్నీ 'ఆంధ్రజ్యోతి' సచిత్ర వారపత్రికలో ముందుగా అచ్చవుతాయి. కథ వారపత్రిక పేజీ (1/4 డెమ్మీ) సైజులో అచ్చులో రెండు పేజీలకు ఎట్టి పరిస్థితిలోనూ మించరాదు. ఇతివృత్తం సామాజికం, శైలి సరళమైన భాషలో విదేశాలలో వున్న ఆంధ్రులకు ఆబాలగోపాలానికి అర్థమయే రీతిలో వుండాలి. ఈ కథలు తిరిగి 'తెలుగు కళాసమితి, న్యూజెర్సీ' ఆధ్వర్యాన వెలువడే హోమ్ మేగ్‌జైన్ "తెలుగు జ్యోతి"లో నెలకు ఒక కథ చొప్పున 18 మాసాలు 18 కథలు పునర్ముద్రితం అవుతాయి.

తెలుగు కళాసమితి, న్యూజెర్సీ తరపున 'ఆంధ్రజ్యోతి' సచిత్ర వారపత్రిక నిర్వహించే మినీ కథల పోటీలో రచయిత్రులు, రచయితలు ఇతోధికంగా పాల్గొని తమ ఉత్తమ రచనలతో ఈ ప్రయత్నాన్ని సఫలం చేస్తారని ఆశిస్తున్నాము.

**12 కథలకు ఒక్కొక్క కథకు రూ. 300/- బహుమతి**

**6 కథలకు ఒక్కొక్క కథకు రూ. 150/- కన్సొలేషన్ బహుమతి**

## పాటించవలసిన నిబంధనలు

* కథ తెలుగు జీవితానికి సంబంధించినదై వుండాలి.
* కథలు అనుకరణ, అనువాదం కాదని, తమ స్వంతమని హామీ రాతలో ఇవ్వాలి.
* బహుమతికి యోగ్యమైన కథల నిర్ణయంపై తుది తీర్పు ఎడిటర్‌దే. ఈవిషయమై ఎటువంటి ఉత్తర ప్రత్యుత్తరాలు జరుపబడవు.
* ఈ బహుమతులు రచయిత(త్రు)లకు అమెరికాలోని తెలుగు కళాసమితి, న్యూజెర్సీవారు అందజేస్తున్నారు.
* ప్రచురణకు అంగీకరించని, పోటీలో బహుమతులు పొందని కథలను తిప్పి పంపడం సాధ్యం కాదు. స్టాంపులు అంటించిన కవర్లు జతపరచనక్కర్లేదు.
* కథ రాతలో 3 1/2 అర తావులకు మించి వుండరాదు.
* కలం పేరు వాడినప్పుడు విధిగా తమ అసలు పేరు, చిరునామా స్పష్టంగా వ్రాయాలి.
* ఈ కథలతోపాటు 12 మంచి కార్టూన్లకు రూ. 50 బహుమతి ఇస్తాము. కార్టూన్లను ఆఫీసుకు వచ్చిన వాటి నుంచి స్వీకరిస్తాము. ఇవి 'తెలుగు జ్యోతి'లో ప్రకటిస్తారు.

రచయితలు, రచయిత్రులు తమ కథలను

**తెలుగు కళాసమితి, న్యూజెర్సీ వారి 1988 విభవ ఉగాది "మినీ కథల పోటీ"కి 28-2-1988 తేదీ లోపుగా పంపాలి.**

— ఎడిటర్

ఆంధ్రజ్యోతి సచిత్ర వారపత్రిక,
పోస్టు బాక్సు నెం. 712
విజయవాడ-520 010